
కులకచర్ల : ఘనాపూర్‌లో మత్తడి దుంకుతున్న చిన్నకుంట


దోమ: మత్తడి దుంకుతున్న పెద్ద చెరువు


పరిగి: లఖ్నాపూర్ ప్రాజెక్టులో గంగమ్మకు హారతి ఇస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

# జలసవ్వడి...

- నిండుకుండల్లా చెరువులు, ప్రాజెక్టులు
- పొంగిపొర్లుతున్న కాగ్నా, కాక్రవేణి నదులు
- మత్తడి దుంకుతున్న లఖ్నాపూర్ ప్రాజెక్ట్
- గంగమ్మకు హారతి ఇచ్చిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- తాండూరు మండలంలోని 33 గ్రామ పంచాయతీలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

పరిగి, సెప్టెంబర్ 1: పరిగి పట్టణంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. శనివారం అర్ధరాత్రి మొదలుకొని ఉదయం వరకు వర్షం కురిసింది. దీంతో ఆదివారం ఉదయం పరిగిలో 40.1 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. మరోవైపు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సైతం తెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉన్నది. దీంతో జన జీవనం స్తంభించింది. ఆదివారం సెలవు రోజు కావడం, వర్షం వల్ల జనం ఇండ్లకే పరిమితమయ్యారు. వర్షంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచింది. భారీ వర్షంతో మండల పరిధిలోని వాగులు వరద నీటితో ప్రవహించాయి. పరిగి నుంచి వికారాబాద్ రూట్‌లో పట్టణ శివారులో గల కాజ్‌వే వద్ద వరద నీరు వెళ్లేందుకు చెత్తను జేసీబీ సహాయంతో తీయించారు. వాగు ఉధృతి దృష్ట్యా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పట్టణంలోని పలు కాలనీలలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ స్వయంగా మున్సిపల్ కమీషనర్ వెంకటయ్య, అధికారులు, కౌన్సిలర్లతో కలిసి పర్యటించారు. వరద నీరు నిలువకుండా ఎప్పటికపుడు వెళ్లేలా ఏర్పాట్లు చేయించారు. తుంకులగడ్డలోని ఎస్టీ గురుకులం ఆవరణలో వరద నీరు నిలువ కుండా జేసీబీ సహాయంతో ఏర్పాటు చేయించారు. ఇదిలావుండగా భారీ వర్షంతో వచ్చిన వరద వల్ల మండల పరిధిలోని లఖ్నాపూర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి మట్టం 18 అడుగులు ఉండగా పూర్తి స్థాయిలో నీరు చేరడంతో ఆదివారం సాయంత్రం నుంచి లఖ్నాపూర్ ప్రాజెక్టు మత్తడి దుంకుతుంది. గత మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో లఖ్నాపూర్ ప్రాజెక్టు


పెద్దేముల్: ఉధృతంగా ప్రవహిస్తున్న గాజీపూర్ వాగు

నిండింది. భారీ వర్షం కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ సూచించారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాటిని దాటే ప్రయత్నాలు చేయరాదని సూచించారు. ఇండ్లల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు, విద్యుత్ స్తంభాలు తాకకుండా జాగ్రత్తలు పాటించాలని, పిల్లలను రోడ్లపైకి వెళ్లకుండా చూసుకోవాలని చెప్పారు. ఇదిలావుండగా లఖ్నాపూర్ ప్రాజెక్టును పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా గంగమ్మకు ఎమ్మెల్యే పూజలు చేసి హారతి ఇచ్చారు. అవసరమైన నిధులు మంజూరు చేయించి లఖ్నాపూర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మత్స్యకారులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. అంతకుముందు వికారాబాద్ రోడ్డులో గల వాగును సందర్శించిన ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు.

**తాండూరు:** తాండూరు నియోజకవర్గంలో ఆదివారం మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోగా కాగ్నా, కాక్రవేణి నదుల్లో జలసవ్వడి కనిపించింది. వాగులు, చెక్‌డ్యాంలు, చెరువులు, కుంటలు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాల పంటపొలాల్లోకి వరదనీరు చేరడంతో పంటలు మునిగిపోయాయి. తాండూరు పట్టణంలో ఆదర్శతులసీనగర్, మిత్రనగర్, గ్రీన్‌సిటీ కాలనీల్లో వరదనీరు ఇండ్లలోకి వచ్చింది. కోకట్‌వాగు, గాజీపూర్ వాగు రోడ్డుపై నుంచి పారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. స్థానిక నేతలు, అధికారులు లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలుపడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు సూచించారు.

**కొడంగల్:** కొడంగల్ పెద్ద చెరువుకు నీటి ప్రవాహం పెరగడంతో, చెరువు కాలువ కట్టు తెగి వరద నీరు పంట పొలాలను, వీధులను ముంచెత్తింది. పట్టణంలోని కుమ్మరి వాడలోకి వరద నీరు చేరుకోవడంతో వీధి వాసులు రాత్రంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గడిచిన 24 గంటల్లో 122.2 మీమీ వర్షపాతం నమోదు అయింది. రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నీటి ప్రవాహం చోట మరమ్మతులు చేపడుతున్నారు. శిథిలావస్థలకు చేరుకున్న ఇండ్లలో నివ


తాండూరు: భారీ వర్షంతో జీవన్గీలో మునిగిన శివాలయం

సించే వారు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ కోరారు. వరద నీరు ఉధృతంగా పారుతున్న చెరువులు, కుంటలు, వాగుల వద్దకు వళ్లవద్దని హెచ్చరించారు. కొడంగల్ పెద్ద చెరువు పాటుకాలువ తెగడంతో వరద నీరు పంట పొలాల్లోకి చేరుకొంది. దాదాపుగా 12 ఎకరాల్లో వేసుకున్న వరి పంట నీటి పాలైనట్లు ఓంప్రకాశ్ అనే కాంగ్రెస్ నాయకుడు వాపోయాడు.

**బొంరాస్‌పేట:** తుఫాను ప్రభావంతో బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో శని, ఆదివారాల్లో భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. శనివారం 50 మిల్లీ మీటర్లు, ఆదివారం 88.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి మండలాల్లోని చెరువు, కుంటల్లోకి వరద నీరు వచ్చి చేరుతుంది. వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఏర్పుమళ్ల కాకరవాణి ప్రాజెక్టు, బురాన్‌పూర్ చిన్నవాగు ప్రాజెక్టు నిండి అలుగు పారుతుంది. బొంరాస్‌పేట, మెట్లకుంట, బురాన్‌పూర్, తుంకిమెట్ల, కొత్తూరు చెరువుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. కాకరవాణి ప్రాజెక్టు, బురాన్‌పూర్, మెట్లకుంట చెరువులు సోమవారం అలుగులు పారే అవకాశం ఉంది. కాకరవాణి ప్రాజెక్టు అలుగు నుంచి భారీ వస్తున్న వరద ఉధృతికి బొంరాస్‌పేట పెద్ద చెరువులోకి వరద నీరు వచ్చే ఏటి కాలువ తెగిపోవడంతో రైతులు వెళ్లి గండిని పూడ్చారు. పలుచోట్ల రోడ్లపై నుంచి వరద నీరు పారుతుంది. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద కారణంగా మండలంలో కాకరవాణి వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. మహాంతిపూర్ వద్ద వాగు ఉధృతంగా పారుతుండడంతో ప్రజలు మండల కేంద్రానికి రాలేకపోయారు. వాగు దాటకుండా


బొంరాస్‌పేట: అలుగుపారుతున్న చిన్నవాగు ప్రాజెక్ట్

ముళ్ల కంప అడ్డంగా వేశారు. వర్షానికి మహాంతిపూర్‌లో హన్మంతుకు చెందిన ఇంటి గోడ ఆదివారం ఉదయం కూలిపోయింది.

**పెద్దేముల్:** మండల పరిధిలోని గాజీపూర్ గ్రామ శివారులోని గాజీపూర్ వాగు, జయరాం తండా(ఇందూరు) సమీపంలో హన్మాపూర్–సంకిరెడ్డిపల్లి గ్రామాల మధ్య ఉన్న ప్రధాన వాగు, తాండూరు–వికారాబాద్ ప్రధాన రహదారి మధ్య ఉన్న మన్సాన్‌పల్లి వాగు పొంగిపొర్లుతున్నాయి. హన్మాపూర్ గ్రామానికి చెందిన పంజుగుల దస్తప్ప ఇల్లు, మారేపల్లి గ్రామానికి చెందిన కనుకని అంజప్ప ఇల్లు కూలిపోయాయి. మన్సాన్‌పల్లి గ్రామ సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహించడంతో వాగుకు అతి సమీపంలో ఉన్న వరి పొలాలు అన్ని నీటి మునిగి వరద ధాటికి మొత్తం కొట్టుకుపోయాయి.

**మర్పల్లి:** మండలంలోని సిరిపురం, తిమ్మాపూర్, కోట్‌మర్పల్లి తదితర గ్రామాల్లో వాగులు పొంగిపొతున్నాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి..తిమ్మాపూర్ వాగు వద్ద తహసీల్దార్ మునిరోద్దీన్, సిరిపురం వాగు వద్ద ఎస్సై సురేశ్ తమ సిబ్బందితో బందోబస్తూ ఏర్పాటు చేశారు.

**దోమ:** దోమ మండల కేంద్రానికి చెందిన పెద్ద చెరువు, నల్ల చెరువు ఆదివారం ఉదయం నుంచి మత్తడి దుంకుతున్నాయి. గొడుగోనిపల్లి వాగు రోడ్డు పై నుంచి ఉధృతంగా ప్రవహించడంతో రాఘవపూర్ నుంచి మహబుబ్‌నగర్ వెళ్లే మార్గం, గడిసింగాపూర్ నుంచి రంగారెడ్డిపల్లి వెళ్లే మార్గంలో కాకరవేణి వాగు రోడ్డుపై నుంచి ప్రవహించడంతో అక్కడ సైతం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే శివారెడ్డిపల్లి, దొంగఎన్కెపల్లి వాగులు పారడంతో రాకపోకలు నిలిచాయి. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి గొడుగోనిపల్లి వాగును పరిశీలించి రాకపోకలను దోమ పాలేపల్లి మీదుగా కొనసాగించే విధంగా సూచనలు చేయాలని అధికారులను ఆదేశించారు. కాకరవేణీ వాగు ఉధృతిని తెలుసుకున్న ఎస్సై ఆనంద్‌కుమార్ అక్కడి పరిస్థితులను పరిశీలించి సిబ్బందిని నిఘా ఉంచారు.దోమ పెద్ద చెరువు నిండుకుండలా మారడంతో చెరువు కట్ట దగ్గర వాటర్ లీకేజీ అవుతుందని దీని వల్ల కట్టకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని దోమ, ఉదన్‌రావుపల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు తొందరగా స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. మండల పరిధిలోని అయినాపూర్, దాదాపూర్, మోత్కూర్ తదితర గ్రామాల చెరువులకు వరద ప్రవాహం కొనసాగుతున్నది.

**కులకచర్ల:** కులకచర్ల మండల కేంద్రంలోని చాపల గూడెం దగ్గర కుంట నిండడంతో వడ్డెర గేరిలో ఉన్న ఇండ్లల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని ఘనాపూర్ గ్రామ సమీపంలో ఉన్న చిన్న కుంట నిండి మత్తడి దుంకుతోంది. దీంతో పాటు ఇప్పాయిపల్లి చెరువు నిండడంతో అలుగు పారుతుంది. రాంనగర్ దగ్గర వాగు పారుతుండటంతో రాకపోకలకు


కొడంగల్: ఉధృతంగా ప్రవహిస్తున్న పోచమ్మతండా వాగు

అంతరాయం కలిగింది.

**బంట్వారం:** మండల కేంద్రం నుంచి యాచారం, మాలసోమారం వెళ్లే రోడ్డులో నురుళ్లాపూర్ వాగు పొంగి ప్రవహిస్తున్నది. వర్షాల వల్ల పెసర, మినుము లాంటి పంటలకు నష్టం వాటిల్లనుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తాండూరు రూరల్:** మండ లంలోని బొంకూరు, అంతారం తండాల్లో రెండు ఇండ్లు కూలిపోయాయి. ప్రధానంగా అల్లాపూర్ వాగులోకి ఓ లారీ దూసుకుపోయింది. అంతరాష్ట్ర రోడ్డు పై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా గౌతాపూర్–కరణ్‌కోట మార్గంలోని బెల్కటూర్ వాగు మరోసారి ఉగ్రరూపం దాల్చింది. దాంతో వాహనాల రాకపోకలు ఆగిపోయి. ఎడతెరిలేకుండా కురుస్తున్న వర్షాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తాండూరు మండలంలోని 33 గ్రామ పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యాయి.


మర్పల్లి: పొంగిపొర్లుతున్న సిరిపురం వాగు


పరిగి: మత్తడి దుంకుతున్న లఖ్నాపూర్ ప్రాజెక్ట్


కులకచర్ల: చౌడాపూర్‌లో మునిగిన పంటపొలాలు..


తాండూరు రూరల్: బెల్కటూర్ వాగు ఉగ్రరూపం..

## నేటి నుంచి అంబురామేశ్వర స్వామి జాతర


జాతరకు ముస్తాబైన శ్రీ అంబురామేశ్వర ఆలయం (ఇన్‌సెట్లో )కొలువైన లింగమయ్య

పెద్దేముల్, సెప్టెంబర్ 1 : మండల పరిధిలోని తట్టేపల్లి పరీవాహక ప్రాంతంలో అత్యంత వైభవంగా జరిగే శ్రీ అంబురామేశ్వర జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ప్రతి ఏటా శ్రావణ మాసం చివరి సోమవారం జాతరను నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఉడువాల వెంకటేశం, కమిటీ సభ్యులు తెలిపారు. జాతరలో భాగంగా ఆదివారం రాత్రి తట్టేపల్లి నుంచి స్వామివారిని పల్లకీలో ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్తారు. సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు,భక్తుల దర్శనం, అన్నదాన కార్యక్రమాలు జరుగనున్నాయి. ఉత్సవాలకు మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలతోపాటు, తాండూరు, జహీరాబాద్, వికారాబాద్, కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా, చించోలి, బీదర్, కుంచారం, షాదీపూర్ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తారు. జాతర నేపథ్యంలో ఆలయ ప్రాంగణంతో పాటు పరిసరాలలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ కె.గిరి తెలిపారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి


అంబేద్కర్ కూడలిలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కొడంగల్, సెప్టెంబర్1: పాత పెన్షన్ విధానాన్ని అమలులోకి తీసుకురావాలని ఆదివారం స్థానిక అంబేద్కర్ కూడలిలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటవ తేదీన సీపీస్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని టీజీఈజేఏసీ పిలుపు మేరకు నిరసన చేపట్టినట్లు తెలిపారు. 2004 సెప్టెంబర్ 1వ తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీపీఎస్ విధానాన్ని ప్రవేశపట్టి ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కులను ప్రభుత్వాలు కాలరాసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నాటి నుంచి నేటి స్వరాష్ట్రంలో కూడా సీపీఎస్ విద్రోహ పాటిస్తూ నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తంగా 2 లక్షల 50వేల ఉద్యోగులు ఐక్యతన చాటుతూ తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మరో నాయకుడు క్రాంతికుమార్ మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానంతో ప్రభుత్వ ఉద్యోగ విరమణ తరువాత ఎటువంటి భద్రత లేకుండా పోయిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దినేష్‌కుమార్, అశోక్, రమేశ్, కరుణాకర్, చంద్రకాంత్, వెంకట్‌రాములు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్టీయూ టీఎస్ నూతన కార్యవర్గం ..



పరిగి, సెప్టెంబర్ 1 : పీఆర్టీయూ టీఎస్ పరిగి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. పరిగి మండల శాఖ అధ్యక్షుడిగా దగ్గుల బుగ్గయ్య, ప్రధాన కార్యదర్శిగా వార్ల రాకేశ్, గౌరవాధ్యక్షుడిగా ఎం.డి.ఉస్మాన్‌అలీ, అసోసియేట్ అధ్యక్షులుగా వెంకటప్రసాద్, డి.మనోహర్, ఉపాధ్యక్షుడిగా కె.శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా తస్లీం, మహిళా కార్యదర్శిగా సంగీత ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన పరిగి మండల కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ అభినందించారు.

### వివాహిత అదృశ్యం..

పరిగి, సెప్టెంబర్ 1: వివాహిత అదృ శ్యమైన సంఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్ గ్రామంలో జరిగింది. ఎస్ఐ సంతోష్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం పరిగి మండలం రూప్ ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన కుక్క పద్మ ఆగస్టు 19వ తేదీన సాయంత్రం 5.30 గంటలకు ఆమె అన్నలకు రాఖీ కట్టేందు కు పరిగికి వెళ్లింది. మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల వద్ద, ఇతరచోట్ల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఆమె భర్త వెంకట య్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PLOT FOR SALE**

★ కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326218

**FARM PLOT SALE**

★ యాచారం సాగర్ హైవే గజం: 4,999/- ఫ్రూట్ ప్లాంటేషన్‌తో ఫార్మాసిటీ, RRRకి దగ్గరలో & బాలానగర్ జడ్చర్ల బెంగుళూరు హైవేకి గజం: 3,999/- శ్రీగంధం చెట్లతో ప్లాట్లు కలవు. స్పాట్ రిజి॥ 7780483434.
NT-332574

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## నిజాయితీ, సమయపాలన ముఖ్యం


సమావేశంలో మాట్లాడుతున్న కోట శివకుమార్

వికారాబాద్, సెప్టెంబర్ 1 : మనిషికి నిజాయితీ సమయపాలన అతి ముఖ్యమైనవని కోట శివకుమార్ తెలిపారు.ఆదివారం శ్రీ సత్యసాయి జ్ఞాన కేంద్రం గంగవరం 22వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలు భువి పై వెల్లివెరియాలని కోరారు. మనిషికి విశ్వాసం, వినయం, క్రమశిక్షణ అవసరం అని తెలిపారు. అందర్నీ ప్రేమించాలన్నారు. ఇతరులకు తోచిన సహాయం చేయాలి కానీ బాధించరాదన్నారు. సభాధ్యక్షులు హారతి ద్వారకానాథ్ మాట్లాడుతూ వ్యక్తి సాధన లేకుండా సేవ చేయడం కష్టమని, పరోక్ష దూషణ మహాపాపమన్నారు. మనిషి మనిషికి మధ్యన నమ్మకం ఉండాలని తెలిపారు. అనంతరం పి. బందెప్ప గౌడ్ రచించిన శ్రీ సాయీశ్వ ర శతకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన కేంద్రం సభ్యులు జగదీశ్వర సింగ్ ఠాకూర్, పున్నయ్య, పద్మాకర్ రావు, రామన్న, శ్రీనివాసులు , డాక్టర్ సత్యనారాయణ గౌడ్, కపిల్‌దేవ్, గోపాల్ రెడ్డి, మనోహర్ రావ్, కులకర్ణి, బసవేశ్వర్, వేణు, సతీష్ చంద్ర పాల్గొన్నారు.

## దుర్భరంగా ఊరెనికితండా రోడ్డు

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 1 : మండలంలోని వడిచెర్ల నుంచి ఊరెనికితండాకు వెళ్లే రోడ్డు దుర్భరంగా మారింది. తండా వరకు రెండు కిలోమీటర్లు మట్టిరోడ్డు ఉంది. గుంతలు పడి అధ్వాన్నంగా తయారైంది. ప్రతి రోజూ ప్రజలు తండా నుంచి వడిచెర్లకు, మండల కేంద్రానికి వస్తుంటారు. వర్షాలు కురుస్తుండడంతో రోడ్డంతా బురదగా మారడంతో తండా ప్రజలు గ్రామానికి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పడి బురదగా మారిన రోడ్డుపై కాలి నడకన రావాలంటే కూడా కష్టంగా మారిందని తండాకు చెందిన రఘు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రజా ప్రతినిధులు స్పందించి వడిచెర్ల నుంచి ఊరెనికితండాకు బీటీ రోడ్డును మంజూరు చేయాలని తండా ప్రజలు కోరుతున్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ ఎల్వోసీ అందజేత


ఎల్వోసీని అందజేస్తున్న నాగరాజు యాదవ్, ఎల్పటి అశోక్‌కుమార్

కులకచర్ల, సెప్టెంబర్ 1 : చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామానికి చెందిన పల్నాటి పెంటయ్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకున్నారు. విషయాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి తెలియజేయడంతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2,25000లు మంజూరు చేయించారు. ఆదివారం కులకచర్ల పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజుయాదవ్, కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ బాధిత కుటుంబానికి ఎల్వోసీని అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సలీమ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బుచ్చయ్య, గ్రామస్తులు యాదయ్య, రాజు, కృష్ణయ్య, చిన్నయ్య, బుచ్చయ్య, యాదయ్య పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962